# అర్ధరాత్రి ఆగంతకుడు

(కథానిక)

వీధికి కొట్టకొసను ఉండటమేకాక హరిజనవాడకు సమీపంలో మా లాడ్జి ఉండేది. నాలుగు పెద్దగదులూ, విశాలమైన లోగిలీ, కొట్టుగదులూ, రెండు వంట వసారాలూ, వీటికి తోడు భారీగా పెరడుతో అసలు రెండు కుటుంబాలకు సరిపోతుంది. అందులో మేం నలుగురమే విద్యార్థులం.

మా వీధిలో ఆమధ్య దొంగభయం పెచ్చు రేగింది. కృష్ణమూర్తి హోటలునుంచి భోంచేసి వస్తూ లక్ష్మినాయుడు పూటకొక పుకారు పుట్టించేవాడు; ప్రతిరోజూ రామునాయుడు తన పూర్వ స్మృతులలోనుండి భయంకరమైన దొంగల కథలు వినిపించేవాడు. రామునాయుడు మా అందరికంటే వయసు, అనుభవాలలో పెద్ద. ఇంటర్ పరీక్షలో వరుసగా మూడేళ్ళనుండి తప్పిపోతున్నాడు. ఈఏడు మళ్ళీ పరీక్ష ప్రయత్నంతోనే తమ్ముడు లక్ష్మినాయనితోపాటు విజయనగరం వచ్చాడు. కారు నల్లగా, పొట్టిగా గ్రామీణ వాతావరణం వంటపట్టిన మా మిత్రుడు మా అందరిలో ధైర్యశాలిగా గణింపబడేవాడు.

రామునాయుడు రోజూ చెప్పే కథలకు తోడు మా ఇంటిమీద రాళ్ళుపడడం—రాత్రి ఒంటిగంటప్పుడు కిటికీలు బంధించుకొని ప్రాణాలరచేతుల్లో బిక్కుబిక్కుమంటుంటే ఎప్పుడు తెల్లారుతుందా, అని కాచుక్కూర్చోవడం నాలుగయిదురోజులు మామూలయిపోయింది. మరునాటి ఉదయం రామునాయుడు ఈ విషయం మీద గంటల తరబడి ఉపన్యసించేవాడు. రాళ్ళు రువ్వడంలో కేవలం పెంకితనం కాదనీ, అందుకు సార్థకం లేకపోలేదనీ మాకు నచ్చచెప్పాడు. గృహస్థులు మేల్కొని ఉన్నదీ లేందీ పరిశీలించడానికి ఇది; వారి విధానమని తెలిసాక, దొంగలు మా లాడ్జిపై కన్నువేసారనీ, ఈనాడు కాకపోతే మరొకనాడు రాక మానరనీ దృఢ విశ్వాసం మా అందరికీ కలిగింది.

ఒకనాటి రాత్రి ఎన్నటికంటే ఆశ్చర్యకరంగా, పదిగంటలయ్యే సరికి మాగది తలుపును ఎవరో కొట్టిన చప్పుడు అస్పష్టంగా నాకు వినిపించింది. నాగుండెలు కొట్టుకొన్నాయి. బి.ఎ. చదువుతున్న మా అన్నయ్యకూడా భయంతో నావంక చూచాడు. చప్పుడు లేకుండా నేనతని గదిలోకి వెళ్ళాను. వీధిలోకి తెరచికున్న మూడు కిటికీలు ఇప్పటికి వారంరోజుల క్రితమే బంధింపబడ్డాయి. నాగది తలుపులకు మూడు గడియలూ బిగింపబడి ఉన్నాయి. కొంచెం సాహసంతో దీపసహాయంతో తలుపులన్నిటినీ మళ్ళీ పరీక్షించాను. తలుపు చప్పుడు మళ్ళీ వినిపిస్తోంది.

నేనూ, అన్నయ్యా ఒకరికొకరు సహాయంగా వెనుకద్వారం తెరచుకొని, పొరుగుగదిలో అప్పటికే కెమిస్ట్రీ పుస్తకాన్ని గుండెలపై పరుచుకొని నిద్రపోతున్న రామునాయుని చప్పుడు లేకుండా లేపి, 'దొంగలు! దొంగలు!' అని మెల్లగా చెప్పాము. లక్ష్మినాయుడుకూడా మేల్కొన్నాడు.

నలుగురం తీవ్రంగా ఆలోచించి, మెల్లగా మా కిటికీదగ్గర చేరాం. లక్ష్మినాయుడు బలమైన దూలకర్రను పట్టుకొన్నాడు. మా పడక కుర్చీనుండి ఇనపకొయ్య ఊడబెరికి రామునాయుడిచేతి కందించాను. ఏదీ దొరక్క మా అన్నయ్య కిరసనాయిలు పంపునే చేత ధరించి వణుకుతూ తొట్రుపడుతున్నాడు.

టకటకమని మళ్ళీ ఈసారి కిటికీ తలుపుల మీద చప్పుడయింది.

'ఇక్కడే ఉన్నాడు. అరుగెక్కాడు దొంగ వెధవ'—అని దొంగను పట్టుకొన్నంత సంతోషంతో అన్నాడు రామునాయుడు.

'తలుపు తియ్యండి!...తలుపు తియ్యండి!'

అతని గొంతుక మాకు నిజంగా భీతి గొలిపింది. గోడ అవతలినుండి ఆ ధ్వని నూతిలో గొంతుక వినిపించింది.

డి. రాధాకృష్ణ పట్నాయక్

మేం కొంచెంసేపు చేష్టలు దక్కి నిల్చున్నాం.

కాని టెలిగ్రాఫు సిగ్నలులా తలుపుమీది టకటకలు మాత్రం ఎడతెరపిలేక వినిపిస్తున్నాయి.

మా అందరిలోనూ స్థూలకాయుడు లక్ష్మినాయుడు. అతను సాహసికుడని వెనుకటి ఈ ఇంట్లోనే పందికొక్కును వెన్నాడి చంపినరాత్రి మేమందరమూ కొనియాడాము. ఈనాడు కూడా అతనే ధైర్యంచేసి దొంగ తలుపు తట్టిన దానికి ప్రత్యుత్తరంగా కాలితో తలుపు తన్నాడు.

కొంచెంసేపు దొంగ కూడా ఊరుకొన్నాడు. రెండుమూడు నిముషాలకు కిటికీ తలుపులు దబదబ మోత్తాడు. రామునాయుడు దానికి సమాధాన మిచ్చాడు.

బయట పాదాల చప్పుడు మా గుమ్మం నుండి సన్నగిల్లింది. ఈసారి రామునాయుడి గది తలుపు చప్పుడయింది. రామునాయుడు చేతిలోని హరికేను దీపం ఊపుకొంటూ పరుగెత్తి తన గది ప్రవేశించి 'ఎవడురా వాడు! ఎవరురా, చెప్పు...' అని బూతుమాటలు కూడా వరుసగా ప్రయోగించాడు. ఇంతలో మేముకూడా అతనికిసహాయంగా గుమికూడాము.

'తలుపు తియ్యండి...తలుపు తియ్యండి.'

'నువ్వెవరివో చెప్పు ముందు తలుపుతీస్తాం...'

'.........'

'ఈ అర్ధరాత్రపుడు నీకీ వెంకితనం అణుస్తానుండు. ఉండు. నీ పొగరు పిండేస్తా, రా, రా; రా, రా;...' అని రామునాయుడు గంభీరంగా, పెద్దగొంతుతో కేకలేస్తున్నాడు, మేము వెయ్యి కళ్ళతో రానున్న దానికి ఎదురు చూస్తున్నాం.

'Open the door please' అని ఈసారి ఇంగ్లీషులో దొంగ మాట్లాడడం చూచి మాకు అందరికీ పట్టరాని కోపం వచ్చింది.

'అబ్బో! ఇంగ్లీషు కూస్తున్నాడే!' అని మా అన్నయ్య అన్నాడు.

'ఆ, ఏదో బొట్లేరు ముక్కలు' — అని ఇంగ్లీషులో ఔట్ వల్లనే మూడో ఏడాది స్కూల్ ఫైనలు పరీక్షకు చదువుతున్న లక్ష్మినాయుడన్నాడు.

'కుర్రోడా! నువ్వు చదువుకొన్నావా ఏమన్నా...?' అని రామునాయుడు కొంచెం ఎగతాళిగా అడిగాడు.

'నీ కది అనవసరం' అని ఇంగ్లీషులో జవాబు.

ప్రశ్న వేసిన మా మిత్రుడు చిన్నబుచ్చుకున్నాడు. మేం యావన్మందిమీ నిరసింపబడి, అవమానపడ్డాము. మా రోషమూ, దొంగ మీది అసహ్యమూ ప్రబలాయి. కాని, దొంగ యందు గౌరవభయాలు కూడా మాలో ఇనుమడించాయి.

'నిలు-నిలు. ఆగరా అక్కడ. ఇదుగో తలుపు తీస్తున్నాం చూడు. అక్కడే ఉండరా తలుపు తీస్తున్నాను...' మొదలయిన హంగామాతో రామునాయుడు అట్టహాసం చేస్తూ, గడియ మెదపుతున్నాడు, కదం తొక్కుతున్నాడు, కేకలూ, అరపులూ, తిట్లూ, డంబాలు చేసి తుదకు నిజంగా తలుపు తీయడం లేదు.

రోషంతో అతను కొంపతీసి తలుపు తెరిచి దొంగలకు ఎర ఔతాడేమో అనే భయంతో చప్పుడు లేకుండా అతన్ని వారించాం; కాని వారించవలసిన అవసరమే లేదని మేము అనుభవశూన్యమైన పసితనంలో ఎరుగం.

'—లక్ష్మినాయుడూ, ఈ లైటు పట్టుకోరా, గెడ తీయాలి; ఆగరా దొంగవెధవా, బైటికి వచ్చి నీ చెమ్డాలూడగొడతాను—అని ఈ తలుపునుండి, ఆ తలుపుకు—ఆ ద్వారం నుండి ఈ ద్వారానికి బుస్సుమని ఎగురుతూ, రొజుతూ, రామునాయుడు కదం తొక్కుతున్నాడు. కొద్దినిముషాలలో అతని నాటకాన్ని అర్థం చేసుకున్న మేం కూడా ఉత్సాహం అభినయించి ప్రగల్భాలకు దొరకొన్నాము.

ఈవిధంగా కనీసం ఒక గంటసేపు గడిచింది. అందరము చెమటలు క్రక్కుతున్నాము. చాల అలసిపోయాము. నిద్ర తేలిపోయి చాల సేపయింది. మాకిది ఒకవిధమైన కేళిగా ఉత్సాహం కలుగజేసింది.

దొంగ పాపం ఎంతకీ పారిపోలేదు. ఎందుకు పారిపోలేదా అని మాకు స్ఫురించలేదసలు. వాడి ఆటలు సాగనీయలేదనీ, వాడికి ప్రవేశం లభింపచేయనీ లేదనీ, మా గర్వం.

ఇప్పటికి పన్నెండు దాటింది. మా గదులన్నీ చిందరవందరగా ఉన్నాయి. పరుపులు త్రొక్కి మూలలకు తన్ని వేశాము. లక్ష్మినాయుని ఇంగ్లీషు పుస్తకం చిరిగిపోయింది. మా అన్నయ్య పుస్త

కాల బీరువాను మా తొందరలో పడగొట్టేం కనుక అందులోని పుస్తకాలు గదినిండా వెద జల్లబడి ఉన్నాయి.

టకటకమని ఇంకా తలుపు చప్పుడు అణగ లేదు. మా అన్నయ్య ఈసారి ధైర్యంచేసి కిటికీ దగ్గరగా నిలచి అడిగాడు:

'తలుపు తీయమంటావా?'

'ఊఁ'

'ఎందుకు?'

'...తలుపు తియ్యి, సోదరా'—ఈమాటకు అందరమూ నవ్వాము.

'అబ్బో వరసలు కలుపుతున్నాడే!' అన్నాడు లక్ష్మీనారాయుడు

కొంచెంసేపు మళ్లీ గలాటాపడి, ఉభయ పక్షాలవాళ్లం విశ్రాంతి తీసుకొన్నాము. తీరిక చూచుకొని రామనారాయుడు గ్లాసుడు నీళ్లు కూడా తాగాడు.

నే నీసారి అడిగాను:

'నువ్వెందు కిక్కడికి వచ్చావు?'

'మోహినికోసం.'

ఈ జవాబుతో మేం కొంచెం విస్మితుల మయ్యాము. 'మోహిని' కాకపోయినా నా సోదరుడు భువనమోహిని. స్వల్ప పరిచయం గలవారు కొందరు అతనిని మోహిని అని పిలవ డంలో ఆశ్చర్యం లేదు.

దొంగకు ఈపేరు తెలియడంలో ఆశ్చర్యం లేదని లక్ష్మీనారాయుడు నిరూపించాడు. ఈ దొంగ మాల గూడెంలోనివాడనీ, వారు తరచు ఈ వీధిగుండా పోతుంటారు, గనుక వీడు తెలుసుకొని ఉంటాడనీ అతని వాదం. అదిగాక, వాడు ఇప్పటి మాటల సందర్భంలో మాలో ఒకరి పేరు గుర్తుపట్టి ఉండవచ్చునని కూడా సంశయించాము.

'అతనిని ఎరుగుదువా నీవు?'

'ఎరుగుదును.'

'ఎలాగు?'

'నా అన్న అవుతాడు.'

మా అన్నయ్య వెంటనే అడిగాడు:

'మీ దే వూరు?'

'సాలూర్?'

'మీ నాన్న ఏంపని చేస్తున్నారు?'

'వైద్యుడు.

'అయితే నీపేరు?' అని ఆతురతతో నే నడిగాను.

'రామలింగస్వామి.'

నిశ్శబ్దంతో నేనూ, మా అన్నయ్యా మొగాలు చూచుకొన్నాము. రహస్యంగా రామనారాయుడు మమ్మల్ని అడిగాడు.

'ఇదంతా నిజమేనా?'

'నిజమే.'

ఒక లిప్త ఊరుకొని, అతనన్నాడు: 'దొంగ ముండాకొడుకు, పిడిమాటలు నమ్మలేం. ఎవరి దగ్గరో విని ఇలా చెప్పుతుండవచ్చు' అని. మేం బదులు పలుకలేదు.

దొంగ మళ్ళీ తలుపు కొడుతున్నాడు. మాకు దేనికీ పాలుపోలేదు. రామనారాయుడు మళ్ళీ విజృంభించి అరుపులు. పొలికేకలతో పెంకు లెగరగొట్టాడు. లక్ష్మీనారాయుడు ఇక ఎక్కువ సేపు భరించలేక, మా పొరుగింటిలో ఉన్న రిటైర్డు డాక్టరుగారికి వినిపించేటట్టు: 'ఏమం డోయ్, పంతులుగారూ! మా లాడ్జిలో దొంగలు! వినిపించడం లేదా! లేవండోయ్. లేవండి!' అని పెద్దకేకలు వేసి ఉదాసీన స్వభావులైన వారిని కూడా మేల్కొలిపాము.

మరో పావుగంట గడిచాక, వీధిలో రిటైర్డు డాక్టరుగారి అల్పకంఠస్వరం దృఢంగా విని పిస్తోంది. దొంగతో అతను మాట్లాడుతున్న చప్పుడు వినిపించి లక్ష్మీనారాయుడు మొదట కిటికీ సన్నగా తెరచిచూచి మమ్మల్ని ప్రోత్స హించాడు.

రెండు లాంతర్లతో నలుగురు బలాఢ్యులం బయటపడ్డాం. నిజంగా మా చిన్నాయనగారి కొడుకే! వాడు భీతుడై, చెమటలు క్రక్కుతూ మావంక దీనంగా చూచాడు. పొరుగింటి ముసలి పంతులుగారికి ఆ రాత్రివేళ నిద్రాభంగ మొనర్చి నందుకు క్షమాపణకోరి వారిని ఎలానో వది లించుకొన్నాం.

రామలింగస్వామి మా అందరికంటే చిన్న వాడు. వాడు మా నలుగురినీ భయపెట్టినందుకు మేము చిన్నబుచ్చుకొని, అలాటి వెంకితనం కూడదని మేకపోతు గాంభీర్యంతో పెడచీవాట్లు పెట్టి మందలించాము.